# భావ నగర్

ఆంధ్రభూమి వీక్లీ.. 5 జూలై, 2001



"ఏమిటి... ఇంతసేపటికా రావడం? నీకోసం అరగంట నుంచీ వెయిట్ చేస్తున్నాను తెల్సా?" విసుగ్గా అన్నాడు చంద్రం.

"సో... వాట్? బస్సు దొరకలేదు... లేటయ్యింది! అయినా- పెళ్ళికి ముందే ఇంతగా విసుక్కుంటున్నావు. పెళ్ళయితే ఇంకెంత విసుక్కుంటావో..?!" అంది మాధవి.

"అస్సలు విసుక్కోను! ఎందుకంటే పెళ్ళయితే ఇలా బీచ్‌లో నీకోసం ఎదురుచూసే అవసరం ఉండదుగా..?"

ఇద్దరూ ఇసుకలో కూర్చున్నారు.

బీచ్‌లో జనం ఎక్కువగానే ఉన్నారు.

"ఏమైనా కబుర్లు చెప్పు మధూ..!" అన్నాడు చంద్రం.

"అంత ఓపిక లేదు సార్! మధ్యాహ్నమెప్పుడో టిఫిన్ తిన్నాను. ఆకలి దంచేస్తోంది. ఆ బజ్జీలవాడు, శెనక్కాయలవాడు నా ఆకలిని మరింత పెంచుతున్నారు. నీవేమో పిసినారి పరబ్రహ్మంలా సైలెంట్‌గా ఉన్నావు!"

"నీవూ సంపాదిస్తున్నావుగా... కొనుక్కోవచ్చుగా!"

"కొనుక్కోగలను. కానీ, ఆడదానికి తనవాడు కొనిస్తే అదో ఆనందం..!"

"ఓ.కే...!"

– అంటూ వెళ్లి, వేయించిన శెనక్కాయలు కొనుక్కొని వచ్చాడు.

"ఇప్పుడు చెప్పు సంగతులు! ఈమధ్య ఏం సినిమాలు చూశావు?" చంద్రం అడిగాడు.

"నువ్వే కావాలి.., ప్రియమైన నీకు.., మురారి!" చెప్పింది మాధవి.

"ఏ సినిమా చూశావని అడిగితే సిటీలో ఆడుతున్న సినిమాల పేర్లన్నీ చెబుతావా?"

"ఏయ్ఁ..! నిజంగా నేనా సినిమాల్ని చూశాను!"

"అంత టైమ్ తమకెక్కడిదో?"

"ప్రతి ఆదివారం ఓ సినిమాకెళ్తాను!"

"స్వార్థం కాకపోతే– నాకా విషయం చెప్తే నేనూ వచ్చేవాణ్ణిగా!"

"నీకు మానాన్న ముందు నిలబడే ధైర్యం వచ్చాక చెబుతానులే!"

చంద్రం ఆమెవైపు కోపంగా చూశాడు.

అతని కోపాన్ని చూసి మాధవి పకపకా నవ్వసాగింది.

తర్వాత అడిగింది–

"అన్నట్టు చందూ..! మీ అమ్మానాన్నలకి మన విషయం చెప్పావా?"

"చెప్పాను. నీ ఫోటో కూడా చూపాను!"

"ఏమన్నారు?"

"నేను నీ పక్కన కాకి ముక్కుకు దొండపండులా ఉంటాననట!"

"ఫర్వాలేదు. నేనెలాగో ఎడ్జస్ట్ చేసుకుంటానని చెప్పలేదా?"

"వాళ్ళు కాకి అన్నది నన్ను కాదు... నిన్ను!"

"కాకి పిల్ల కాకికి ముద్దు! అయినా– ఈ కాకుల గోల మనకెందుకుగానీ, కాస్త సీరియస్‌గా చెప్పు!"

"మధూ..! మా అమ్మకు నీవెంతో నచ్చావు. ఇక నాన్నగారైతే తనకెలాంటి కోడలు కావాలని అనుకున్నారో నీవు అలాగే వున్నావని అన్నారు."

"థాంక్యూ చందూ... థాంక్యూ!"

– చంద్రం చేతిని ఆనందంతో నొక్కుతూ అంది.

"మరి, నీ సంగతేమిటి?" చంద్రం అడిగాడు.

"నేనూ ఇంట్లో చెప్పాను. మా నాన్న సంతోషపడ్డాడు గానీ, ఓ మధ్యతరగతి ఆడపిల్ల తండ్రిలా కొద్దిగా భయపడుతున్నారు కూడా! నిన్నోసారి చూడాలన్నారు!"

"నేను రెడీ! ఇంతకీ... ఎంత కట్నం ఇవ్వగలడు మీ నాన్న?"

"కట్నం ఇవ్వకుండా కూతురి పెళ్ళి చేయాలన్నది ఆయన ఆదర్శం!"

"అది ఆదర్శం కాదు... పిసినారితనం! ఆయన తన పెళ్ళి కట్నం లేకుండా చేసుకుని ఉంటే అప్పుడు అది ఆదర్శం!"

"మా నాన్న కట్నం వద్దనడమే కాదు- పెళ్ళిఖర్చులు కూడా తానే పెట్టుకున్నారు తెల్సా..?!"

"అంత వికారంగా ఉంటారా మీ నాన్న?"

మాధవి కోపంగా చంద్రం వైపు చూసింది. ఈసారి నవ్వడం చంద్రం వంతయింది.

"పోనీలే... కట్నం నాకు వద్దుగాని, నీ జీతమెంతో చెప్పు!"

"ఆడవాళ్ళ జీతం, మగవాళ్ళ వయసు అడగరాదు!"

"నా వయసు ఇరవై ఎనిమిది!"

"నా జీతం నాలుగు వేలు!"

"ఇంతదాకా ఎంత సేవ్ చేశావు?"

"ఓ యాభైవేల దాకా..!"

"ఏం చేస్తావు ఆ డబ్బుతో?"

"పెళ్ళిఖర్చులకు మా నాన్నకు ఇస్తాను!"

"ఆయన వద్దంటే..?"

"పెళ్ళయ్యాక నీకిస్తాను!"

"పెళ్ళికి ముందు ఇవ్వవా?"

"అవసరమైతే ఇస్తాలే! కాసేపాగు... నేను వెళ్ళి వేడివేడి బజ్జీలు తీసుకొస్తాను!"

"నేను తెస్తాలే... నీవు కూర్చో!" ఆమెని కూర్చోబెట్టి చంద్రం వెళ్ళాడు.

బజ్జీలు తింటూ-

"మధూ... నేను చిన్నప్పటినుంచీ మిరపకాయ బజ్జీలంటే ఇష్టంగా తినేవాడిని. కానీ, ఇలా నీతో తింటూంటే ఇంకా రుచిగా ఉన్నట్లనిపిస్తోంది!" అన్నాడు చంద్రం.

"నన్ను కూడా నంజుకుని తింటున్నావుగా... అందువల్ల!"

మళ్ళీ ఆమె వైపు కోపంగా చూశాడు.

"కోపంలో నీవెంత అందంగా ఉంటావో తెల్సా చందూ..?!"

"నేను వెళ్తున్నాను!"

"చందూ... మళ్ళీ వచ్చే శనివారం!"

- గట్టిగా అంది... దూరంగా వెళ్తున్న చంద్రాన్ని.

చంద్రం తిరిగి చూళ్ళేదు.

మనసులోనే నవ్వుకుంటూ సిటీ బస్టాప్ వైపు నడిచింది మాధవి.

● ● ●

"నాకు అర్జెంటుగా యాభైవేలు కావాలి!"

ఉలిక్కిపడింది మాధవి.

"యా...భై...వే...లా..?" ఒక్కొక్క అక్షరాన్ని ఒత్తిపలుకుతూ అంది.

"అవును! నీదగ్గర వుందిగా... మన పెళ్ళి లోపల నీకిచ్చేస్తాను!" అన్నాడు చంద్రం.

"జోకా?" అనుమానంగా అడిగింది.

"కాదు... సీరియస్సే! నిజానికి ఒకరిని అప్పు అడగడం నాకిష్టం లేదు. అర్జెంటు కాబట్టి అడుగుతున్నాను. అదీ... నువ్వు కాబట్టి చనువుకొద్దీ ఈ రిక్వెస్టు!"

"అంత డబ్బు ఎందుకు చందూ?"

తటపటాయిస్తున్న మాధవిని చూసి, "ఓ.కే... నీకు నామీద నమ్మకం లేకుంటే వద్దు! నా తంటాలేవో నేను పడతాను!"

"నమ్మకం లేకుండా కాదు. కారణం కూడా చెప్పడం నీ ధర్మం!"

"తర్వాత చెప్తానన్నాగా..!"

విసుగ్గా అన్నాడు మళ్లీ-

"నీ డబ్బు నేనేం దుబారాగా తాగుడుకీ, పేకాటకీ తగలబెట్టను... సరేనా?"

"అది నా ఉద్దేశం కాదు చందూ! ప్లీజ్... నన్నర్థం చేసుకో! మూడేళ్లు పగలూ, సాయంత్రాలు స్కూల్లో పిల్లలతో, ఇంట్లో ట్యూషన్ పిల్లలతో అరచి, చదివించి, రాయించి, కష్టపడి సంపాదించిన డబ్బు- నీవు తాగుడుకి తగలబెట్టాలనే లేదు. ఏ షేర్లలోనో, చిట్‌ఫండ్స్‌లోనో పెట్టినా మనం కోల్పోయే ప్రమాదం ఉంది. డబ్బు పోయాక ఆ డబ్బు నీదైనా, నాదైనా బాధ మనిద్దరిదే కదా..!"

"అలాంటిదేమీ లేదులే! మన పెళ్ళయ్యేలోగా నీ డబ్బు నీకు తిరిగి ఇచ్చే పూచీ నాది! ఈ విషయం ఎవరికీ చెప్పకు. ముఖ్యంగా మీ నాన్నకి! ఈ వయసులో ఆయనకి టెన్షన్ పెట్టకు!"

"అయితే... కారణం చెప్పనంటావ్?!"

"అయితే... డబ్బు ఇవ్వనంటావ్?!"

"ఓ.కే... ఇస్తాను. తిరిగి ఇవ్వడానికి నీకు ఎంత టైం పడుతుంది?"

"ఆరునెలలు పట్టవచ్చు. వీలైతే ఇంకా ముందుగా కూడా ఇచ్చేస్తాను. అయినా ఫక్తు బిజినెస్ వుమన్‌లా అడుగుతావేం..?"

చివుక్కున తలెత్తింది మాధవి.

ఆమె కళ్ళల్లో నీళ్లు!

"సరే... ఇక ఏ ప్రశ్నా అడగను. ఎల్లుండి సోమవారం నేను ఉదయాన్నే బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు కాన్సిల్ చేసి క్యాష్ తీసుకుంటాను. సాయంత్రం నీవు మా స్కూల్‌కొచ్చి డబ్బు తీసుకోవచ్చు... వస్తాను!"

మెల్లగా నడుస్తూ వెళ్తున్న మాధవి వైపే చూస్తూండిపోయాడు చంద్రం.

• • •

మాధవి మనసంతా ఆందోళనగా ఉంది.

అందుకు కారణం- చంద్రంని మళ్లీ కలవలేకపోవడం!

ఆఫీస్‌కి ఫోన్‌చేస్తే... పర్మిషన్ మీద బయటకి వెళ్లాడనో, లీవులో ఉన్నాడనో... జవాబు వస్తోంది. బీచ్‌కైనా వస్తాడని ప్రతి శనివారం బీచ్‌లో ఎదురుచూసింది.

చంద్రం రాలేదు.

'ఒకవేళ... డబ్బు చేతికి వచ్చింది కనుక ఇక తన అవసరం తీరిపోయిందనుకున్నాడా? ఛ... ఛ... ఏమిటి తను ఇలా ఆలోచిస్తోంది? ఎన్ని పనులున్నా కనీసం స్కూలుకైనా ఫోన్ చేయవచ్చుగా?' రెండు నెలలవుతోంది అతన్ని కలిసి.

'తను పరాకుగా ఉన్న విషయం తన తల్లిదండ్రులు గమనించలేదు. నాన్నగారి స్నేహితుని గృహప్రవేశం కోసం అతనికి సహాయంగా వీళ్ళిద్దరూ పనులు పంచుకోవడంతో ఇంట్లో ఎక్కువ ఉండడం లేదు వాళ్ళు! అదీ ఒకందుకు మంచిదే! లేకుంటే... తన బాధ వాళ్ళకీ పంచి ఇవ్వాల్సి వచ్చేది!' ...అనుకుంది.

ఆరోజు ఉదయం ఆమె తండ్రి మాధవిని పిలిచి-

"అమ్మా..! ఈరోజు సాయంత్రం నీవు స్కూల్ నుంచి సరాసరి శ్రీధర్ కొత్త ఇంటికి వచ్చేయి. నీ సలహాలు, సహాయం కూడా వాడికి కావాలిట! ఎంతైనా- ఈకాలం పిల్లలకు తెలివితేటలు ఎక్కువ!" అంటూ అడ్రస్ ఇచ్చాడు.

'సరే'నని తలాడించింది.

ఆ సాయంత్రం అడ్రస్ వెతుక్కుంటూ వెళ్లి ఇల్లు కనుక్కుంది.

తండ్రి ఉత్సాహంగా ఇల్లంతా చూపించాడు.

"ఎలా ఉందమ్మా... ఇల్లు?"

"చాలాబాగుంది నాన్నా! ప్లానింగ్ అద్భుతంగా ఉంది. అపార్ట్‌మెంట్ అయినా... లోపలికొచ్చాక ఏదో ప్యాలస్‌లో అడుగుపెట్టినట్లుంది!"

"కూర్చోమ్మా..!" తానూ ఓ కుర్చీలో కూర్చుంటూ... "నేను ఉద్యోగంలో ఉండగానే ఓ మంచిఇల్లు కట్టుకోవాలని ఎంతో ప్రయత్నించాను. అది ఈరోజు వరకూ నెరవేరలేదు. కాని, నాకు ఆ విషయంలో అసంతృప్తి లేదమ్మా! అందం, తెలివితేటలు, మంచితనం అన్నీ ఉన్న నీవే నాకు పెద్ద ఆస్తి!" అన్నాడు కళ్ళనీళ్లతో.

"ఎందుకు నాన్నా... అలా ఫీలవుతారు? మీకేం తక్కువైంది? నిజాయితీగా బ్రతికారు... మంచిపేరు తెచ్చుకున్నారు... మీకేం తక్కువ?"

"నిజమేనమ్మా! నాకేం తక్కువ..? బంగారంలాంటి కూతురు, బంగారంలాంటి అల్లుడు!"

"అల్లుడా?" ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగింది.

"అల్లుడేనమ్మా! చంద్రం అందంలో, మంచితనంలో నీకు సరైన జోడి! నీ సెలక్షన్ చాలా గొప్పదమ్మా!"

"నాన్నా..! ఆయన మిమ్మల్ని ఎప్పుడు కలిశారు?" ఆశ్చర్యం, ఆనందం మిళితమైన స్వరంతో అంది.

"అతను నీ దగ్గర యాభైవేలు తీసుకున్న వెంటనే..!"

భయంగా తండ్రి వంక చూసింది.

"పిచ్చితల్లీ! చంద్రం నాకంతా చెప్పాడమ్మా! నీ డబ్బు చంద్రం వృథా చేయలేదమ్మా! నీకొక శుభవార్త చెప్పనా అమ్మా... ఈ ఇల్లు నీ ఇల్లేనమ్మా! నీ పేరుతోనే చంద్రం కట్టిస్తున్నాడు. నీ పేరుతోనే రిజిస్టర్ అవుతోంది."

"ఈ ఇల్లు నా ఇల్లా..?"

మాధవికి కలో, నిజమో అర్థంకాలేదు.

"అవునమ్మా! నిన్ను సస్పెన్స్‌లో ఉంచి సర్‌ప్రైజ్ చేయాలని చంద్రం నీకు చెప్పలేదు. డబ్బు కూడా చివరిక్షణంలో ఎక్కడా దొరకక నీ దగ్గర తీసుకున్నాడు. నెలరోజుల్లో ఏదో లోన్ శాంక్షన్ అవుతుందిట... నీ డబ్బు తిరిగి ఇచ్చేస్తాడట!"

ఎంత గొప్పతనం చంద్రంది..?

తాను ఎంత సంకుచితంగా ఆలోచించింది?

"ఇంకో విషయం తల్లీ! నిన్ను చేసుకోవడానికి పైసా కట్నం కూడా అఖ్ఖర్లేదట! నీవే పెద్ద కట్నమట! ముందు పెళ్ళికి, ఆ వెంటనే గృహప్రవేశానికి ముహూర్తాలు చూడమన్నాడు!"

మాధవి మనసు ఆనందంతో పరవశింపసాగింది.

మళ్లీ ఇల్లంతా తృప్తిగా చూడసాగింది.

బెడ్‌రూమ్ అందాన్ని చూస్తూ అలాగే నిలబడిపోయింది.

ఇంతలో...

వెనుకనుంచి "ఎలా ఉంది... నా ప్రేమనగర్?" అని వినిపిస్తే తిరిగి చూసింది.

ఎదురుగా... చంద్రం!

ఇక విరహం భరించలేనట్లు-

"చందూ..!"

- అంటూ అతని గుండెలపై వాలిపోయింది.

తర్వాత తేరుకుని-

"యూ... ఎంత టెన్షన్ పెట్టావు? కనీసం ఫోన్ అన్నా చేయాలని అనిపించలేదా నీకు?" చిరుకోపంగా అంది.

"నిజంగానే ఈ ఇంటిపనులతో బిజీగా ఉన్నాను మధూ! పైగా- నిన్ను కలిస్తే అసలు విషయం చెప్పేస్తానేమో... అని భయపడి నిన్ను కలవలేదు!"

"అసలు... ఇల్లు కొనాలనే ఆలోచన ఎలా కలిగింది నీకు?"

"నాకు యుక్తవయసు వచ్చిన కొత్తలో 'ప్రేమనగర్' సినిమా చూశాను. అందులో హీరో కళ్యాణ్ హీరోయిన్ కోసం ఓ ప్రేమనగర్ కట్టిస్తాడు. ఆనాడే అనుకున్నాను- నేనూ నా ప్రియురాలికి పెళ్ళికి ముందే ఓ ప్రేమనగర్ కట్టివ్వాలని! పెళ్ళయిన తర్వాత కట్టిస్తే ఆ అనుభూతి వేరు! థ్రిల్ వుండదు! నీ డబ్బు తీసుకోవడం ఇష్టంలేకపోయినా... మన పెళ్ళికి ముందే ఇల్లు పూర్తవ్వాలన్న పట్టుదలతో నీ సహాయం పొందాను. చెప్పు మధూ... నా ప్రేమనగర్ నీకు నచ్చిందా?!"

"ప్రేమనగరూ నచ్చింది... ఇన్ని మధురభావాల నిలయమైన నీ భావనగరూ నచ్చింది!" అతని హృదయాన్ని చూపిస్తూ అంది మాధవి.